# దేశ గతిని మార్చే అద్భుతమైన బడ్జెట్

## - రూ.12 లక్షల పన్ను మినహాయింపు విప్లవాత్మకం

## - 50 లక్షల మందికి రైతులకు రూ.5 లక్షదాకా రుణాలు - కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఫిబ్రవరి, 01

కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉందని, పేద, మధ్యతరగతి, రైతులు, చిరు వ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు ఇది అనుకూలమైన బడ్జెట్ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. మధ్యతరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరమని,ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్యగా పేర్కొన్నారు. గత 75 ఏళ్లలో మధ్య తరగతి ప్రజల కోసం ఇంత అనుకూలమైన బడ్జెట్ ఎన్నడూ రాలేదన్నారు. 2027నాటికి అమెరికా, చైనా తరువాత భారత్ ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరింపజేసే దిశగానే బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ సహా దేశంలో లక్ష రూపాయల లోపు జీతభత్యాలు పొందే ఉద్యోగులందరు, పన్ను మినహాయింపు వల్ల సగటున రూ.80 వేలు ఆదా చేసుకునే అవకాశ ముందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే టీవీ, మొబైల్స్, లెదర్ ఉత్పత్తులు,ఎలక్ట్రిక్ వాహనాలపై ధరలు తగ్గబోతున్నాయన్నారు. ఈ బడ్జెట్ రైతులకు వరంలాంటిదని, 7.7 కోట్ల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పేరిట రుణాలివ్వడమే లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప విషయమన్నారు. తెలంగాణలో దాదాపు 50 లక్షల మంది రైతులకు రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం లభించే అవకాశముందన్నారు. ధన ధాన్య క్రుషి యోజన పథకం, పప్పు దినసుల కోసం ప్రత్యేక కమిషన్,జాతీయ పత్తి కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం తెలంగాణలో పత్తి, పప్పు దినుసులు పండిస్తున్న రైతులకు ప్రయోజన కారిగా మారనుందన్నారు. యువతను వ్యాపార, పారిశ్రామికవేత్తలను చేసేందుకు ఎంస్ఎంఈ రుణాలను రూ.5 కోట్ల నుండి రూ.10 కోట్లకు పెంచడంతోపాటు, స్టార్టప్ లకు రూ.20 కోట్ల వరకు రుణాలిస్తామని బడ్జెట్లో పేర్కొనడం ద్వారా ఎంతో ప్రయోజనం కలగబోతోందన్నారు.

## అన్ని వర్గాలకు మేలు చేసే బడ్జెట్

### బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

కరీంనగర్, ఫిబ్రవరి, 01



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని, వికసి త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు గొప్ప శు భవార్త లాంటిదని, ముఖ్యంగా వేతన జీవులకు కేంద్ర ఆర్థిక మంత్రి ఉపశమనం కలిగించే శు భవార్త చెప్పారన్నారు. క్యాన్సర్,ఇతర తీవ్రమైన వ్యాధులకు సంబంధించి 36 రకాల మందులను కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయించడం సంతోషకరమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మూడు లక్షల నుండి 5 లక్షల వరకు పెంపు, పప్పు ధాన్యాల ఉత్పత్తికి సమృద్ధి పథకం, పండ్లు కూరగాయల ఉత్పత్తికి కొత్త పథకం ప్రారంభం చేయడం రైతాంగానికి ఎంతో తోడ్పాటు లభించేలా ఉన్నాయన్నారు. మొత్తం మీద బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే విధంగా ఉన్నాయంటూ కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ , ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పాత పన్ను విధానంలో లేని మార్పులు

### పొదుపుకు దూరం కానున్న ప్రజలు

### మ్యాన పవన్ కుమార్



జగిత్యాల, ఫిబ్రవరి, 01

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీత రామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో నూతన పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు యిచ్చినా, పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవడం శోచనీయమని కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ అన్నారు.మధ్యతరగతి వారిని పొదుపుకు దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నూతన పన్ను విధానం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ఇది ఆమోదయోగ్యమైనది కాదన్నారు. అలాగే బడ్జెట్ లో విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, ఈ సారి రూ. 1,28,650 కోట్లు (2.53%) కేటాయించడం జరిగిందన్నారు. గత సంవత్సరం కన్నా 0.03 శాతం తక్కువ నిధులను కేంద్రం విద్యకు కేటాయింపులు చేసిందన్నారు. ప్రభుత్వ విద్యపై కేంద్రం సవతి ప్రేమ చూపుతోందడానికి గత పదేళ్లలో 3.16 నుంచి 2.53 శాతానికి నిధులు తగ్గి పోవడమే కారణం అన్నారు. పాత పన్నుల విధానంలో పది లక్షల వరకు ఎలాంటి పన్ను లేకుండా మినహాయింపచిచ్చే విధంగా పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలని, కనీసం లక్షా యాభై వేల రూపాయలు స్టాండర్డ్ డిటెక్షన్ గా మినహాయింపులు ఉండాలని మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు.

## ఘనంగా భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు

కాటారం, ఫిబ్రవరి, 01



పద్మశాలి కుల దైవమైన భక్త మార్కండేయ జయంతి ఉత్సవాన్ని కాటారం మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం కాటారం మండలం గారెపల్లిలో గల శ్రీ భక్తాంజనేయ శివాలయంలో పద్మశాలి సంఘం నాయకులు రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పద్మశాలీల కులదైవమైన భక్త మార్కండేయుని జీవిత చరిత్ర సమాజానికి ఆదర్శమని కాటారం మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు దోమల సమ్మయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం మండల పద్మశాలి సంఘం నాయకులు మాచర్ల రాజేందర్, గాదె. రమేష్, పులి అశోక్, కొండా వెంకటేశ్వర్లు, ఎలుగం సత్యనారాయణ, మాచర్ల రాజయ్య, దోమల రాజశేఖర్, పల్నాటి బలరాం, మాచర్ల సత్యనారాయణ, పినగాని రమేష్, మాచర్ల వెంకటేష్, బత్తుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భిక్షమయ్య జీవితంపై పుస్తకం

### అరసం నేతలు వేల్పుల,మాదాసు




గోదావరిఖని, ఫిబ్రవరి, 01

విప్లవోద్యమ నాయకుడు బొజ్జ బిక్షమయ్య జీవితాన్ని, ఆచరణను పుస్తక రూపంలో తీసుకురాబోతున్నట్లు అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, నాయకులు మాదాసు రామ్మూర్తి తెలిపారు. గోదావరిఖని ప్రెస్క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ ఉద్యమాలు, పోరాటాల ద్వారా సమాజంలో మార్పును తీసుకువచ్చిన బొజ్జ బిక్షమయ్య జీవితాన్ని 'అస్పృశ్యయోధుడు' పేరుతో పుస్తక రూపంగా తీసుకు వస్తున్నట్లు చెప్పారు. బుద్ధుడు నుండి గద్దర్ వరకు అనే మరో పుస్తకాన్ని కూడా, ఈనెల 4న ఆవిష్కరించనున్నామని వెల్లడించారు.ఈ పుస్తక ఆవిష్కరణలో ముఖ్యఅతిథులుగా ఎంఎల్ ఏ, రాజ్ ఠాకూర్,మినిమం వేజ్ మెంబర్ జనక్ ప్రసాద్, గుర్తింపు సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, సిఐటియు నేత తుమ్మల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి పాల్గొననుండగా, అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, రామ్మూర్తి పుస్తక సమీక్ష చేయనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అభ్యుదయ వాదులు, సాహితీవేత్తలు, రచయితలు,కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు బొజ్జ వెంకటయ్య, వెంకట రమణ స్మారక ట్రస్ట్ నాయకులు వై.యాకయ్య, ఏలేశ్వరం వెంకటేష్,సాగర్, పాల్గొన్నారు.

## ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

### సహకార సంఘాల్లో జిల్లా కలెక్టర్ తనిఖీ

జగిత్యాల, ఫిబ్రవరి, 01



ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. కథలాపూర్ మండలం భూషణ్ రావుపేట, రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులు, లైసెన్సులు, బిల్ బుక్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే గత సంవత్సర, ప్రస్తుత సంవత్సర సబ్సిడీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘాల పరిధిలో ఎరువుల విక్రయాలు, విక్రయాల సందర్భంలో నియమ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘాల కార్యదర్శులకు మండల వ్యవసాయ అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా సహకార, మార్కెటింగ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించండి

### ఎమ్మెల్సీని కోరిన రవాణా శాఖ అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి, 01



జగిత్యాల జిల్లా కేంద్రంలో రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఆ శాఖ అధికారులు శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ప్రస్తుతం రవాణా శాఖ కార్యాలయం జగిత్యాల మండలం తాటిపల్లిలో ఉన్న కారణంగా సమస్యలు తలెత్తుతు న్నాయని ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. జిల్లా కేంద్రంలో రవాణా కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యాలయ స్థల సేకరణ కొరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రీజినల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యులు కమటాల శ్రీనివాస్, రవాణా శాఖ అధికారులతో పాటు ప్రైవేటు టూరిస్ట్ ఓనర్లు, ఆర్ టి ఏ ఏజెంట్లు పాల్గొన్నారు.

## విజ్ఞన్న యువసేన దాతృత్వం

### జర్నలిస్ట్ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం



పెద్దపల్లి, ఫిబ్రవరి, 01

విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్ రెడ్డి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదంలో కాలు కోల్పోయి దీనస్థితిలో ఉన్న జర్నలిస్టు కుటుంబానికి పదివేల రూపాయలు నగదు అందించి అండగా నిలిచారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం చిన్న రాతుపల్లి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ నెల రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్ రెడ్డి రాజశేఖర్ ను శనివారం సాయంత్రం పరామర్శించి, తన వంతు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, భవిష్యత్తులో వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు దొమ్మటి రాజేష్, వోడ్నాల అజయ్, గూగులోతు రామచందర్, బందెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది




వేములవాడ, ఫిబ్రవరి, 01

వేములవాడ పట్టణానికి చెందిన బి ఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైలారం రాము ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు వచ్చిన వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, పార్టీలో చేరాలనే నిర్ణయం తీసుకున్నట్లు వారి సందర్భంగా తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు, రాష్ట్రం ప్రజలకు న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమైతుందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో ఎళ్ళ తరబడి ఎంతో క్రియాశీకలంగా పనిచేసినా, సరైన గుర్తింపు దక్కలేదని అన్నారు..రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్ వస్తాది కృష్ణ, నాయకులు చిలుక రమేష్, గుర్రం తిరుపతి, దూలం భూమేష్, సిరిగిరి శ్రీకాంత్, బాబున్, పోతారం రాజ బోస్ తదితరులు పాల్గొన్నారు. చింతల తాడెం దేవయ్య, చింతల తాడెం శ్రీను, మల్లేశం, మద్రిపల్లి మైసయ్య, పోతారం రమేష్, రాజు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## జనవరిలో 1,10 వేల మెట్రిక్ టన్నుల యూరియాఉత్పత్తి

### ఆర్.ఎఫ్.సి.ఎల్ సిజిఎం ఉదయ్ రాజహంస

గోదావరిఖని, ఫిబ్రవరి, 01



రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో గత జనవరి మాసంలో 110604,33 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తిని సాధించినట్టు చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ రాజహంస తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ యూరియా ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించిన కార్మికులు, ఉద్యోగులు అధికారులను అభినందించారు. దేశంలో ఎరువుల కొరతను తీర్చేందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ ను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. 2021 మార్చి 22నపూర్తి స్థాయిలో కర్మాగారంలో ఉత్పత్తులు ప్రారంభమ య్యాయ న్నారు.ఈ ప్లాంటులో ఉత్పత్తి అయిన యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర,తమిళనాడు, ఛత్తీస్‌గఢ్,మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. 2025 జనవరిలో కర్మాగారంలో 1,10,604.33 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి కాగా, ఇందులో తెలంగాణకు 54555.30 మెట్రిక్ టన్నులు, ఆంధ్ర ప్రదేశ్ కు 30377.25 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 8734.68 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 2623.59 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్ కు 5643.72 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 8669.79 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని చెప్పారు.

